క్లుప్తంగా

'మాక్ పోలింగ్'

లింగాలఘణపురం : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులతో మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులే ఎన్నికల అధికారులుగా వ్యవహరించి ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా తరగతి, పాఠశాల నాయకులను ఎన్నుకోవడం, అందుకు నామినేషన్ల ప్రక్రియ, ఉపసంహరణ, ఓటింగ్, లెక్కింపు, ఫలితాల ప్రకటన తదితర ఎన్నికల ప్రక్రియను నిర్వహించి ప్రజాస్వామ్యంలో ఓటు విలువను తెలియజేశారు. ఇన్‌చార్జ్ హెడ్మాస్టర్ పద్మ, ఉపాధ్యాయ బృందం రాములు, శ్రీనివాసరావు, సంపతయ్య, సుమతి, కిష్టయ్య, శ్రీనివాసు, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన



బచ్చన్నపేట : మండలంలోని దబ్బగుంటపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులై తరగతుల్లో తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి ప్రతిభను కనబర్చారని ప్రధానోపాధ్యాయులు రత్నం తెలిపారు. డీఈఓగా జశ్వంత్, ఎంఈఓగా సాయికుమార్, హెచ్‌ఎంగా వాణి, టీచర్లుగా యశ్వంత్‌రెడ్డి, పార్థుకుమార్, దుర్గాప్రసాద్, రాజు, ఇత్విక, శ్రావణి వ్యవహరించారు. ఉపాధ్యాయులు గొట్టె కనకయ్య, రఘుమూర్తి, ప్రవీణ్, పద్మ విద్యార్థులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన శ్రీనివాస్‌రావు



పాలకుర్తి టౌన్ : జనగామ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన షేక్ రిజ్వాన్ బాషాను శనివారం జెడ్పీ ఫ్లోర్ లీడర్ పూస్కురి శ్రీనివాస్‌రావు, జిల్లా కో ఆప్షన్ సభ్యుడు ఎండీ మదార్ మర్యాదపూర్వకంగా కలసి మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నియామకం



జఫర్‌గఢ్ : జఫర్‌గఢ్‌కు చెందిన మహమ్మద్ ముక్తార్‌అలీని కాంగ్రెస్ మండల అధికార ప్రతినిధిగా నియమించినట్లు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర శనివారం ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ముక్తార్‌అలీ విలేకరులతో మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన సింగపురం ఇందిర, జిల్లా, మండల నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టే సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ బలోపేతానికి కృషిచేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

తిరుమలనాథస్వామి ఆలయ చైర్మన్‌గా నర్సింహులు

స్టేషన్‌ఘన్‌పూర్ : స్థానిక తిరుమలనాథస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా ఘన్‌పూర్‌కు చెందిన నీల నర్సింహులును నియమించినట్లు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర తెలిపారు. వైస్ చైర్మన్‌గా రేండ్ల సమ్మయ్య, డైరెక్టర్లుగా గుంటి నరేష్, ప్రతాపగిరి కుమారస్వామి, గట్టు రాజు, రమారమేష్, గోనెల రాజేందర్, ముప్పిడి రాములు, పొన్న సత్యనారాయణ, మోటం రామకృష్ణ, బొజ్జ రాజు, గన్ను శ్రీనివాస్‌ను నియమించినట్లు తెలిపారు. అనంతరం నూతన కమిటీని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు.

'కాంగ్రెస్‌లోకి రానివ్వం'



స్టేషన్‌ఘన్‌పూర్ : మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్యను, ఆయన అనుచరులను ఎట్టి పరిస్థితుల్లోను కాంగ్రెస్ పార్టీలోకి రానిచ్చేది లేదని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కీసర దిలీప్‌రెడ్డి అన్నారు. డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు బస్వగాని అనీల్‌గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దిలీప్‌రెడ్డి మాట్లాడారు. గత కొంతకాలంగా రాజయ్య కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాజయ్య కాంగ్రెస్‌లోకి వస్తున్నారనే ప్రచారంతో పార్టీ కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రధానంగా నియోజకవర్గానికి చెందిన మహిళా నాయకులు, కార్యకర్తలు రాజయ్యను కాంగ్రెస్ పార్టీలోకి తీసుకోవద్దని ఏకంగా గాంధీభవన్‌కు వెళ్లి ఆందోళన చేశారన్నారు. సమావేశంలో వివిధ మండలాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

'ధరణి' సమస్యలు పరిష్కరించాలి

● అదనపు కలెక్టర్లు పింకేష్‌కుమార్, రోహిత్‌సింగ్

స్టేషన్‌ఘన్‌పూర్ : ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ, తహసీల్దార్‌తో ధరణి సమస్యలపై చర్చించారు. ఈనెల 9వ తేదీ వరకు ధరణిలో ఉన్న రైతుల భూములకు సంబంధించిన పెండింగ్ సమస్యల్ని పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక చొరవతో పనిచేయాలన్నారు. ధరణిలో ఒక్కొక్క మాడ్యుల్‌లో ఉన్న పెండింగ్ సమస్యల్ని అంశాల వారిగా చర్చించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ డీఎస్ వెంకన్న, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, డీటీ విజయ్‌కుమార్, ఆర్‌ఐలు అర్జున్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహించకండి

లింగాలఘణపురం : ధరణిలో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారంపై అధికారులు నిర్లక్ష్యం వహించొద్దని అదనపు కలెక్టర్(రెవెన్యూ విభాగం) రోహిత్‌సింగ్ హెచ్చరించారు. ధరణి స్పెషల్ డ్రైవ్ సందర్భంగా శనివారం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్పెషల్ డ్రైవ్‌లో పెండింగ్ సమస్యలను ఏ మేరకు పరిష్కరిస్తున్నారనే విషయాన్ని పరిశీలించారు. ఆయా గ్రామాల వారిగా ఉన్న టీం సభ్యులు తమ పరిధిలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.



స్టేషన్‌ఘన్‌పూర్: ఆర్డీఓ, తహసీల్దార్‌కు సూచనలిస్తున్న అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్

దరఖాస్తుదారులకు సమాచారం అందిస్తాం..

బచ్చన్నపేట : ధరణిలో భూ సమస్యలపై దరఖాస్తు చేసుకున్న వారందరికి సమాచారం అందిస్తామని తహసీల్దార్ విశాలాక్షి శనివారం తెలిపారు. దరఖాస్తు దారులకు ఫోన్ చేసి సమాచారం తెలుపుతామని వారి వద్ద ఉన్న పత్రాలలో అధికారుల వద్దకు హాజరు కావాలని సూచించారు. నాయబ్ తహసీల్దార్ ఖాసీం, ఆర్‌ఐ శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్లు సుమన్, యాకయ్య పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యలు లేకుండా చేయాలి

చిల్పూరు /స్టేషన్‌ఘన్‌పూర్ : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ వెంకన్న శనివారం సందర్శించారు. ఫారం-6, 8 దరఖాస్తులు తదితర అంశాలపై సూచనలు చేశారు. అనంతరం తహసీల్దార్ సరస్వతీతో కలిసి మాట్లాడుతూ ధరణిలో రైతుల భూములకు సంబంధించిన పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని అన్నారు. సమావేశంలో డీటీ విమల, ఆర్‌ఐ కల్వల శ్రీనివాస్ సిబ్బంది ఉన్నారు. అనంతరం ధరణి ఇబ్బందులు తొలగించి రైతులను ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు కేశిరెడ్డి లక్ష్మారెడ్డి కోరారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టిన వెంకన్నను శనివారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. చెవుల యాదగిరి, కుదురు శ్రీనివాపసరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, చారి పాల్గొన్నారు.



లింగాలఘణపురం: సిబ్బందికి సూచనలిస్తున్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్



బచ్చన్నపేట: దరఖాస్తు దారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ విశాలాక్షి

పోలియో చుక్కలు వేయించండి

రఘునాథపల్లి : పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని మండల వైద్యాధికారి కమల హాసన్ కోరారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో శనివారం పల్స్‌పోలియోపై ఆస్పత్రి సిబ్బందికి అవగాహన కల్పించారు.0-5 వయస్సు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. మండలంలో ఐదేళ్లలోపు పిల్లలు 4,343 మంది పిల్లలు ఉన్నారన్నారు. 34 బూత్‌లు, 3 రూట్స్, ముగ్గురు సూపర్‌వైజర్లు సిబ్బంది పోలియో చుక్కలు వేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అవగాహన ర్యాలీ..

కొడకండ్ల : పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారి హరికృష్ణ కోరారు. ఆదివారం నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని పురస్కరించుకొని శనివారం మండలకేంద్రంలోని ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులచే అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ పోలియో రహిత సమాజం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. హెచ్‌ఎం ప్రభాకర్, సీహెచ్‌ఓ దయాకర్, వైద్యసిబ్బంది రమేష్‌బాబు, లలిత, మంజుల, సైదమ్మ, కోటి, ఆశ కార్యకర్తలు శారద, యాకమ్మ, ఏస్తేరు తదితరులు పాల్గొన్నారు.



కొడకండ్ల : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న నరేందర్

జనగామ రూరల్ : ఇళ్లు లేని ప్రతి నిరుపేదకి స్థలంతో పాటు రూ.5లక్షలు మంజూరు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బోడ నరేందర్ అన్నారు. శనివారం మండలంలోని పసరమడ్లలోని గ్రామ కంఠంలోని 7 ఎకరాల భూమి ఉండగా సీపీఎం గ్రామ పార్టీ ఆధ్వర్యంలో పేదలు గుడిసెలు వేశారు. ఈసందర్భంగా గుడిసెల వద్ద ఆయన మాట్లాడుతూ.. అనేక మంది పేదలు సొంత ఇల్లు కూడా లేని పరిస్థితిలో ఉన్నారని ఏళ్ల తరబడి అద్దె ఇళ్లలో ఉంటు కాలం వెల్లదీస్తున్నారని అన్నారు. తక్షణం పేదల ఇళ్ల స్థలాలకు పట్టాలిచ్చి నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సాంబరాజు యాదగిరి, తాండ్ర ఆనందం, మల్లేష్, ప్రసాద్, గుడిసె వాసులు పాల్గొన్నారు.

సేవాలాల్ ఆశయాలు కొనసాగించాలి

● ప్రభుత్వ చీఫ్ విప్ రాంచంద్రు నాయక్

పాలకుర్తి టౌన్ : గిరిజనులకు నాటి ప్రధాని ఇందిరా గాంధీ రిజర్వేషన్లు కల్పించారని ప్రభుత్వ విప్ రాంచంద్రు నాయక్ అన్నారు. శనివారం పాలకుర్తిలో సద్గురు సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఝాన్సీ రెడ్డితో కలసి ఆయన పాల్గొన్నారు. భోగ్ బండారో కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజీవ్ చౌరస్తా నుంచి గిరిజనులు ర్యాలీ చేపట్టగా ఎమ్మెల్యే యశస్విని, విప్ రాంచంద్రు నాయక్ ఉత్సాహంతో ఆడారు. అనంతరం సభలో రాంచంద్రు నాయక్ మాట్లాడుతూ..సేవాలాల్ ఆశయాలు గిరిజనులు కొనసాగించాలన్నారు. రూ. 2 కోట్లతో మంజూరైన సేవాలాల్ భవన నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని అన్నారు.

హామీలను త్వరగా నెరవేరుస్తాం..

నియోజకవర్గంలోని గిరిజనులకు ఇచ్చిన హామీలను త్వరగా నెరవేరుస్తామని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. సేవాలాల్ భవన నిర్మాణం త్వరలో పూర్తి చేసి రాబోయే వేడుకలు అతి ఘనంగా నిర్వహిస్తామని అన్నారు. జిల్లా పరిషత్ సీఈఓ అనిల్ కుమార్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు జాటోత్ నెహ్రూ నాయక్, డాక్టర్ ఎల్. లక్ష్మినారాయణ నాయక్, రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి. హమ్యా నాయక్, సురేష్ నాయక్, కృష్ణమూర్తి, భాస్కర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



జయంతి వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ రాంచంద్రు నాయక్, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

శాశ్వత ప్రాతిపదికన సాగునీటికి చర్యలు

దేవరుప్పుల : నియోజకవర్గంలో సాగునీరు అందించేందుకు శాశ్వత ప్రాతిపదికన కార్యాచరణ చేపడుతామని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రామచంద్రాపురం, చౌడూరు, రంబోజీగూడెంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ.20 లక్షల చొప్పున గ్రామ పంచాయతీ భవననిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజాపాలనలో అర్హులకు గ్యారంటీ పథకాల అమలుతోపాటు నియోజకవర్గంలో అత్యవసర మౌలిక వసతుల కల్పన కోసం పాటుపడుతామన్నారు. శాతాపురం సరిహద్దు కెనాల్ కాల్వ మరమ్మతులు చేసి పెద్దతండా మీదుగా చౌడూరు చెక్‌డ్యామ్‌లోకి సాగునీటిని వదిలేలా చర్యలు చేపట్టామన్నారు.

కోచింగ్ లేకుండానే కొలువులు



ఎండబట్ల మానస

రఘునాథపల్లి : మండలంలోని నిడిగొండ గ్రామానికి చెందిన ఎండబట్ల మానస ఎలాంటి కోచింగ్ లేకుండా ఒకే ప్రయత్నంలో రెండు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైంది. తల్లిదండ్రులప్రోత్సాహంతోనే మానస ఇటీవల విడుదలైన ఫలితాల్లో డిగ్రీ, జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగాలకు ఎంపికయ్యారు.డిగ్రీ లెక్చరర్ ఉద్యోగంలో చేరుతానని మానస పేర్కొన్నారు. రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంతో మానసకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

సహకారం అభినందనీయం

● జీసీడీఓ గౌసియా బేగం

దేవరుప్పుల : విద్యాభివృద్ధికి పాటుపడుతున్న దాతల సహకారం అభినందనీయమని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జీసీడీఓ గౌసియా బేగం సూచించారు. శనివారం మండల కేంద్రంలోని హైస్కూల్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, నోట్‌బుక్స్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అత్యంత ప్రమాణాలతో ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యాబోధన అందుతోందని, ఈ క్రమంలో మాక్ జెడ్పీ సమావేశంలో ఇటీవల ప్లాస్టిక్ వాడకంపై రాష్ట్రస్థాయి ప్రతిభ కనబర్చడం అభినందనీయమన్నారు. త్వరలో జరిగే పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల్లో మండల టాపర్‌లకు రూ.10 వేల ప్రోత్సహకాన్ని అందిస్తామన్నారు. లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఈదునూరి నర్సింహరెడ్డి, బూత్కూరి అశోక్ రెడ్డి, కోశాధికారి గోలిపెద్ద ఉప్పల్ రెడ్డి, రెడ్డి సంఘం అధ్యక్షుడు ఈదునూరి రామచంద్రారెడ్డి, మర్రి పట్టాభిరామ్ రెడ్డి, రమేష్ శర్మ, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

జనగామ రూరల్ : విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్య బోధనను అందించడమే పాఠశాల ప్రధాన లక్ష్యమని ఏసీపీ దామోదర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని సాన్ మారియా పాఠశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఏసీపీ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. యూకేజీ విద్యార్థులకు సర్టిఫికెట్స్, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తుమ్మ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఆంథోని, మేనేజర్ మధు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యార్థుల వికాసం

క్రమశిక్షణతో కూడిన అభ్యసనం వల్ల విద్యార్థి వికాసం పెరిగి ఉన్నతంగా ఎదుగుతాడని విక్టోరియా యూనివర్సిటీ న్యూజిలాండ్ రిటైర్డ్ ప్రొఫెసర్ భాస్కర్ అన్నారు. శనివారం గ్రీన్ వుడ్ పాఠశాల 20వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా భాస్కర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన అనుభవాలతో కూడిన సందేశాలను విద్యార్థులకు తెలియజేశారు.ఈకార్యక్రమంలో గ్రీన్ వుడ్ పాఠశాల ప్రిన్సిపాల్ సలావుద్దిన్ గ్రామస్తులు పలువురు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఏసీపీ దామోదర్‌రెడ్డి

'నిధులు రికవరీ చేయాలి'

రఘునాథపల్లి : మండలంలోని కంచనపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో అవినీతికి పాల్పడిన వారి నుంచి నిధులు రికవరీ చేయాలని సొసైటీ చైర్మన్ చీమలపాటి రవీందర్ అధ్యక్షతన జరిగిన మహాజన సభ ఏకగ్రీవంగా తీర్మానించింది. శనివారం సొసైటీ ఆవరణలో ఏర్పాటు చేసిన మహాసభకు పలు గ్రామాలకు చెందిన సభ్యులు పాల్గొన్నారు. తొలగించిన సీఈఓ శ్రీనివాస్ సొసైటీ ఎరువులు విక్రయించి రూ.13 లక్షలు సొంతానికి వాడుకున్నట్లు విచారణలో తేలినందున వెంటనే క్రిమినల్ చర్యలు తీసుకొని నిధులు రికవరీ చేయాలని తీర్మానించారు. అలాగే నూతన భవన నిర్మాణం, సొసైటీ భూమికి హద్దులను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

నేటినుంచి ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల సమ్మె

జనగామ రూరల్ : ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి రాజు డిమాండ్ చేశారు. శనివారం ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్స్, క్లీనర్స్ యూనియన్ సమావేశం బోనగిరి భిక్షపతి అధ్యక్షతన నిర్వహించారు. నేటినుంచి జిల్లా వ్యాప్తంగా సమ్మెను ప్రారంభిస్తున్నట్లు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. డ్రైవర్లు చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నారని తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు.పెరిగిన ధరలకు అనుగుణంగా నెలకు రూ.26 వేలు ఇవ్వాలని ఈఎస్‌ఐ, ప్రమాదబీమా అందించాలని అన్నారు. ఎం. రాజు, డి.వెంకటేశ్వర్లు, భాస్కర్, పరుశురాములు, రమేష్, అనిల్‌కుమార్, ఆంజనేయులు, సతీష్, సాయికుమార్, యాదగిరి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

శ్రీపాదరావు జయంతి వేడుకలు

జఫర్‌గఢ్ / రఘునాథపల్లి : జఫర్‌గఢ్ మండల రెవెన్యూ కార్యాలయంలో, రఘునాథపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఉమ్మడి ఏపీ మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నర్సయ్య గౌడ్, రాజయ్య జన్మదిన..

నర్మెట/స్టేషన్‌ఘన్‌పూర్: మాజీ ఎంపీ, బీజేపీ రాష్ట్ర నాయకుడు బూర నర్సయ్య గౌడ్‌తో పాటు స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య జన్మదిన వేడుకలను ఆయా పార్టీ శ్రేణులు శనివారం ఘనంగా నిర్వహించారు.

నిబంధనలకు విరుద్ధంగా..

స్టేషన్ ఘన్‌పూర్ : మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుజ్జరి రాజు, మాజీ సర్పంచ్ తాటికొండ సురేష్ తదితరుల ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య జన్మదిన వేడుకలు గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించడంపై పలువురు విమర్శలు చేస్తున్నారు.

మోటార్ వైర్లు చోరీ

బచ్చన్నపేట : మండలంలోని చిన్నరామన్‌చర్ల శివారులోని రైతులు శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, సంజీవరెడ్డి, పుల్లయ్య, నర్సిరెడ్డి, తిరుపతిరెడ్డి, సుధాకర్, నరేందర్‌రెడ్డి వ్యవసాయ బావుల మోటార్ వైర్లు శుక్రవారం రాత్రి చోరీకి గురయ్యాయి.

పరామర్శ

కొడకండ్ల /దేవరుప్పుల : కొడకండ్ల మండలంలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన కున్సోత్ పెద్దయ్య, దేవరుప్పుల మండలంలోని సింగరాజుపల్లికి చెందిన దాస సూర్యమ్మ ఇటీవల మృతి చెందారు. బాధితులను శనివారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు.

దంపతులకు తీవ్రగాయాలు

దేవరుప్పుల : జనగామలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని నీర్మాలకు చెందిన బీఆర్‌ఎస్ మండల నాయకుడు కొత్త జలంధర్‌రెడ్డి దంపతులకు తీవ్రగాయపడ్డారు. మండలంలోని నీర్మాల నుంచి బైక్‌పై జనగామకు వెళ్తున్న జలంధర్‌రెడ్డి దంపతులకు పొక్లెయినర్ ఢీకొట్టడంతో ఇరువురి చేతులు, కాళ్లు విరిగాయి. విషయం తెలిసిన మాజీ మంత్రి దయాకర్‌రావు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించేందుకు చర్యలు తీసుకున్నారు.

తాగునీటి సమస్య రావొద్దు

చిల్పూరు : మండలంలోని నష్కల్‌లో వేసవికాలం దృష్ట్యా తాగునీటి సరఫరాకు బోరుబావి ఏర్పాటు చేయిస్తామని మాజీ సర్పంచ్ కర్ణకంటి స్వప్నవెంకటేష్, పంచాయతీ కార్యదర్శి స్నేహ తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ తాగునీటి ఇబ్బందులను తొలగించేందుకు నేడు(ఆదివారం) పెద్ద వాటర్ ట్యాంక్ సమీపంలో బోర్ వేయించి నీటి సమస్య లేకుండా చూస్తామన్నారు.

ఆర్థికసాయం

బచ్చన్నపేట : మండలంలోని కొడవటూర్ గ్రామానికి చెందిన చింతల కొమురయ్య ఇటీవల మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబ సభ్యులకు మాజీ సర్పంచ్ సతీష్‌రెడ్డి శనివారం రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. నాయకులు నీల కనకయ్య, మిన్నాలపురం కనకయ్య, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

బచ్చన్నపేట : మండలంలోని బండనాగారంలో దుర్గామాత ఆలయ నిర్మాణానికి కేబీఆర్ ఫౌండేషన్ చైర్మన్ కొండి వెంకట్‌రెడ్డి రూ.21 వేల విరాళాన్ని అందించినట్లు తెలిపారు.

ఎస్సైని కలిసిన నాయకులు

జఫర్‌గఢ్ /చిల్పూరు : జఫర్‌గఢ్ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన రవి యాదవ్‌ను కాంగ్రెస్, బీఆర్‌ఎస్, సీపీఎం, సీపీఐలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. చిల్పూరు ఎస్సై రాజేందర్‌ను మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు రంగు రవి శనివారం ఎస్సైని కలిసి శాలువాతో సన్మానించారు. ఈర్ల కనకరాజు, ఎడ్ల ప్రశాంత్ ఉన్నారు.

ఏసీపీని కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

జనగామ రూరల్ : జనగామ ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన దామోదర్‌రెడ్డిని శనివారం జిల్లా ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్, రాజశేఖర్, రవీందర్, మహేష్, ఉదయ్, భాస్కర్, రవి, నాగేష్, నర్సింగరావు పాల్గొన్నారు.

కడియంను కలిసిన వెల్ది గ్రామస్తులు

రఘునాథపల్లి : మండలంలోని వెల్ది గ్రామానికి చెందిన పలువురు శనివారం ఎమ్మెల్యే కడియం శ్రీహరిని మర్యాద పూర్వకంగా కలిశారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మారుజోడు రాంబాబు, మాజీ సర్పంచ్, ఎంపీటీసీ, పార్టీ నాయకులు హనుమకొండలో కడియం శ్రీహరిని కలిసి గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్డీఓను కలిసిన కాంగ్రెస్ నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్ : ఘన్‌పూర్ ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టిన డీఎస్ వెంకన్నను కాంగ్రెస్ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. నాయకులు కేశిరెడ్డి లక్ష్మారెడ్డి, చెవుల యాదగిరి, కుందూరు శ్రీనివాస్‌రెడ్డి, చారి, ప్రశాంత్‌రెడ్డి ఉన్నారు. అదే విధంగా గిరిజన నాయకులు ఆర్డీఓను మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందించి శాలువాతో సన్మానించారు. ఎస్టీ ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం ధరావత్ రాజు, నాయకులు లకావత్ చిరంజీవినాయక్, భూక్య రమేష్‌నాయక్, భూక్య శ్రీనివాస్, రవీందర్ నాయక్, తేజావత్ సుమన్, రాజు పాల్గొన్నారు.

'గృహజ్యోతి'తో పేదల జీవితాల్లో వెలుగు



పాలకుర్తి: జీరో విద్యుత్ బిల్లు అందజేస్తున్న రాంచంద్రు నాయక్, యశస్విని రెడ్డి

● ప్రభుత్వ చీఫ్ విప్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

పాలకుర్తి : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకం పేద విద్యుత్ వినియోగదారుల జీవితాల్లో వెలుగులు నింపుతోందని ప్రభుత్వ చీఫ్‌విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. శనివారం నియోజకవర్గ కేంద్రంలో జీరో విద్యుత్ బిల్లును వినియోగదారులకు అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులతో పాటు విద్యుత్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పేదల ప్రభుత్వం కాంగ్రెస్

నర్మెట : పేదల ప్రభుత్వం కాంగ్రెస్ అని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గంగం నర్సింహారెడ్డి అన్నారు. ఆరు గ్యారంటీల అమలులో భాగంగా గృహజ్యోతి 200 యూనిట్ల లోపు జీరో బిల్లును కార్యకర్తలతో కలసి శనివారం వినియోగదారులకు అందించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు బండి అశోక్, మండల మహిళా అధ్యక్షురాలు దేవులపల్లి భాగ్యలక్ష్మి, టౌన్ అధ్యక్షుడు ప్రజ్ఞాపురం శ్రీధర్, ఉపాధ్యక్షుడు అనందాసు నాగరాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నర్మెట: జీరో బిల్లు అందజేస్తున్న నర్సింహారెడ్డి

ఉచిత విద్యుత్ హామీ అభినందనీయం

రఘునాథపల్లి : ప్రభుత్వం ఉచిత విద్యుత్ హామీ అమలు చేయడం అభినందనీయమని ఎంపీపీ మేకల వరలక్ష్మి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలను అమలు చేసి పేదల జీవితాల్లో వెలుగులు నింపుతునున్నట్లు ఆమె అన్నారు. శనివారం మండల కేంద్రంలో కొనసాగుతున్న జీరో విద్యుత్ బిల్లులను ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. కాంగ్రెస్ పాలనలో మరో సారి ఇందిరమ్మ రాజ్యం రాబోతుందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఐఎన్‌టీసీ రాష్ట్ర అధ్యక్షుడు నీలం ఐలేష్, వైస్ ఎంపీపీ గుగులోత్ రంగమ్మ, ఎంపీటీసీ పేర్ని ఉషారవి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, గాదె మహేందర్‌రెడ్డి, ఏఈ రాములు, ఏఓ హనుమంత నాయక్, ఫోర్‌మన్ వీరాంజనేయులు, లైన్‌మన్ వెంకట్‌రెడ్డి, జేఎల్‌ఎం జగదీష్, చింతకింది సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సిలిండర్‌ను పంపిణీ చేస్తున్న మహాత్మాచారి

సబ్సిడీ గ్యాస్ సిలిండర్ల పంపిణీ

బచ్చన్నపేట : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదల పక్షపాతి అని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కోడూరి మహాత్మాచారి అన్నారు. శనివారం మండల కేంద్రంలో పలువురు లబ్ధిదారులకు సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ వంటి పథకాలు ఇప్పటికే అమలవుతున్నాయన్నారు. మేనేజర్ పులిగిళ్ల పూర్ణచందర్ పాల్గొన్నారు.

దేవరుప్పుల : మండల కేంద్రంలోని బస్‌స్టేజీ కాలనీలో విద్యుత్ శాఖ ఏఈ సుధాకర్ పర్యవేక్షణలో 200 యూనిట్ విద్యుత్‌ను వాడుకున్న లబ్ధిదారులకు జీరో కరెంట్ బిల్లును అందజేశారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి



అశ్విని(ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్ : బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో మండలంలోని మీదికొండకు చెందిన చిదురాల అశ్విని(30) తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందింది. మీదికొండకు చెందిన చిదురాల రాజేందర్, అశ్విని దంపతులు వారి కుమార్తెతో కలిసి పాలకుర్తిలో ఓ శుభకార్యానికి బైక్‌పై శుక్రవారం వెళ్లారు. తిరిగి సాయంత్రం ఇంటికి వస్తుండగా మీదికొండ క్రాస్‌రోడ్డు సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్ వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం వేగంగా వచ్చి వీరిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అశ్విని తలకు తీవ్రగాయాలయ్యాయి. బంధువులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హనుమకొండలోని ప్రైవేటు ఆస్పత్రికి, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. కాగా అశ్విని చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది.కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వాహనదారుడు ప్రకాశం జిల్లాకు చెందిన నాదమల్ల భాస్కర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.